సాక్షి వికారాబాద్

గురువారం । 11 । జూలై । 2024



అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీ

తాళాలు పగులగొట్టి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీకి పాల్పడిన ఘటన పరిగి పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. 10లో▸



కలప అక్రమ రవాణా

మొక్కలు నాటి సంరక్షించాలని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నా ఆ మాటలు నీటి మీద రాతలే అవుతున్నాయి. 10లో▸



వ్యాధుల కాలం.. జర భద్రం

వర్షాలు పడుతున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ఇది పేదల ప్రభుత్వం
స్పీకర్ ప్రసాద్‌కుమార్



కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో ప్రసాద్‌కుమార్

అనంతగిరి: రాష్ట్రంలో పేదల ప్రభుత్వం అధికారంలో ఉందని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జాఫర్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, మోహన్, నాయకులు శివయ్య, తుకారం, బందెల్లి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బీజేపీ నేత



ఎస్పీని సన్మానించిన మారుతీకిరణ్, నేతలు

పరిగి: ఎస్పీ నారాయణరెడ్డిని బుధవారం కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతీకిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి పలు విషయాలపై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖ, టెలికాం అడ్వైజర్ కమిటీ సభ్యుడు హరికృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, కార్యవర్గ సభ్యుడు అనిల్, జోగు రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓగా శ్యాంకుమార్



వికారాబాద్/ధారూరు: ధారూరు, వికారాబాద్ ఫారెస్టు రేంజ్‌ల ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌ఓగా వికారాబాద్ ఫారెస్టు స్ట్రైకింగ్ ఫోర్స్ రేంజర్ శ్యాంకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ రెండు రేంజ్‌ల ఎఫ్‌ఆర్‌ఓ అరుణను ఈ నెల 2న సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. దీంతో శ్యాంకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ చార్మినార్ సర్కిల్ ఫారెస్టు సీసీఎఫ్ రాంబాబు ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన అరుణ ఆయనకు బాధ్యతలు అప్పగించకుండా జాప్యం చేస్తూ వచ్చారు. చివరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్యాంకుమార్ బాధ్యతలు స్వీకరించారు.

కొడంగల్ పోస్టాఫీసులో ఆధార్ సేవలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని పోస్టాఫీసులో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్ట్ మాస్టర్ నరేష్ బుధవారం తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు ఉంటే సరి చేసుకోవాలన్నారు. ఆధార్ అప్‌డేట్ తోపాటు పేరు, పుట్టిన తేదీ, చిరునామా, ఫోన్ నంబర్‌ను సరి చేసుకోవచ్చని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలతో రావాల్సి ఉంటుందని తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డు కోసం వచ్చేవారు బర్త్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలని సూచించారు.

యూపీ బ్యాంక్ మేనేజర్ల బృందం పర్యటన
మహిళా సంఘాల పనితీరుపై ఆరా

నందిగామ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన 35 మంది బ్యాంక్ మేనేజర్ల బృందం మహిళా సంఘాల పనితీరును తెలుసుకునేందుకు మండలంలో పర్యటించారు. ఈ మేరకు బుధవారం వారు జాతీయ జీవనోపాదుల మిషన్, పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో నందిగామ, మేకగూడ గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. సంఘాలు తీసుకునే రుణాలు, పనితీరు, చెల్లింపుల విధానం, ఉపాధి తదితర విషయాలను సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, బ్యాంకులు ఇస్తున్న సహకారం ఎల ఉంది.. స్వయం ఉపాధితో మహిళా సంఘాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం స్వర్ణలత, ఏపీఎం యాదగిరి, సీసీలు అనురాధ, రజనీ, పలువురు మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఖద్దరు వెనుక కన్నీటి గాథ



రాజకీయం మోజులో జీవితాలు అతలాకుతలం
- దర్పం కోసం ఖరీదైన కార్ల కొనుగోలు
- ఆపై.. స్థాయికి మించి ఖర్చులు
- హారతి కర్పూరంలా కరిగిపోతున్న ఆస్తులు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న చోటా, మోటా లీడర్లు

తాండూరు: నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఐదేళ్లుగా పదవిలో కొనసాగారు. ఈ నెల 4వ తేదీ పదవీకాలం ముగిసింది. సదరు ప్రజాప్రతినిధి ఎన్నికల కోసం చేసిన అప్పులు నేటికీ తీరలేదు. ఈ ఐదేళ్ల కాలంలో వడ్డీలు పెరిగిపోయి ఏకంగా రూ.4 కోట్ల వరకు అప్పు మిగిలింది. అప్పులు తీర్చేందుకు తాండూరులో తన పేరిట ఉన్న 3 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టాడు. ఇది ఒక్క ప్రజాప్రతినిధి పరిస్థితి కాదు.. గత ఐదేళ్లుగా పదవుల్లో కొనసాగిన వారి పరిస్థితి.

గుదిబండగా ఖర్చులు

రాజకీయ మోజు ఎన్నో జీవితాలను అతలాకుతలం చేస్తోంది. పదవులు రాని వాళ్లే కాదు.. అధికారం అనుభవిస్తున్న వారూ ఇబ్బందుల్లో ఉన్నారు. హోదా, దర్పం కోసం స్థాయికి మించిన ఖర్చులు పెడుతున్నారు. గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులతో పాటు జిల్లా స్థాయి రాజకీయాల్లో ఎదిగిన వారు సైతం చేస్తున్న ఖర్చులు గుదిబండగా మారుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, సహకార సంఘాల చైర్మన్ల లాంటి పదవుల తోపాటు చోటామోటా నామినేటెడ్ పదవులు దక్కించుకున్న వారు.. తాము సాధించేది ఏమోగానీ అడ్డగోలు ఖర్చులతో రోడ్డున పడుతున్నారు. కష్టనష్టాలను ఎదురొడ్డి నిలిచే వారు కొందరే.. పదవుల మీద వ్యామోహంతో ఎన్నికల్లో తలపడి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఓడిన వాళ్లే కాదు గెలిచిన వాళ్లు కూడా సంతోషంగా లేరని గతంలో జరిగిన ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధుల ఆర్థిక స్థితిని చూస్తే స్పష్టమవుతుంది. రాజకీయాల్లో ఎదురుదెబ్బలు తిని నిలదొక్కుకున్నోళ్లు మాత్రమే అచితూచి ఖర్చు చేస్తున్నారు.

గొప్పలకు పోయి..

రాజకీయాల్లో నలుగురి ముందు గొప్పగా తిరగాలంటే పెట్రోల్, డీజిల్ కోసం ప్రతిరోజూ రూ.1,500 నుంచి రూ.3,000 వరకు ఖర్చు చేయాల్సిందే.. నలుగురు అనుచరులను వెంట వేసుకొని వెళ్లడంతో వారికి భోజనం, రాత్రి ఇంత మందు సర్దాల్సిందే. కనీసం రూ.2 వేల వరకు ఖర్చు చేయడం చూస్తుంటాము. దీంతో ప్రతి నెలా ఒక్కో నాయకుడు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నియోజకవర్గానికి తమ నేత వస్తే స్వాగతం పలికేందుకు లీడర్లంతా నేత ఎక్కడ పర్యటించినా ఆయన కారు వెంట వరుసగా లీడర్లు కార్లను కాన్వాయ్‌గా పెట్టి బలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. నెల తిరగ్గానే ఈఎంఐ కట్టాలని మెసెజ్‌లు, ఫోన్లు రావడంతో ఒక్కో నెలా డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో భారీగా ఫెనాల్టీలను కడుతున్నారు. కార్లకు తీసుకొన్న లోన్లను సరిగ్గా చెల్లించకపోవడంతో ఎంతో మంది లీడర్లు డీ ఫాల్టర్ల జాబితాలో చేరి ఎక్కడ కూడా మరోసారి రుణం తీసుకోకుండా మారిపోయిన లీడర్ల సంఖ్య ఇటీవల కాలంలో అధికమైంది. మరోవైపు పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులంతా అప్పులు తీర్చేందుకు పెద్దలు సంపాదించిన ఆస్తిని విక్రయించి రుణం చెల్లించిన వారు ఉండటం గమనార్హం.

బలం ప్రదర్శించిన వారికే పదవులు

రెండు దశాబ్దాల క్రితం వరకు రాజకీయ నాయకులు ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా రాజకీయాలు చేస్తూ వచ్చారు. సర్పంచ్ స్థాయి నుంచి మొదలుకొని ఎమ్మెల్యే స్థాయి వరకు ప్రజాప్రతినిధులంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆదర్శవంతమైన రాజకీయాలను నడిపించారు. ప్రస్తుత రాజకీయాల్లో వినూత్నమైన మార్పులు వచ్చాయి. ఖద్దరు చొక్కాలు ధరించి కార్లలో తిరిగుతున్న వారినే పార్టీలు ఆదరిస్తున్నాయి. ప్రస్తుతం ఖరీదైన కార్లు కొనుగోలు చేయాలంటే నెలవారి వాయిదాల ప్రకారం కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయి. దీంతో చోటామోటా లీడర్లందరూ కార్లు కొనుగోలు చేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో, బ్యాంకులు కార్లకు లోన్లు ఇస్తున్నాయి. దీంతో సర్పంచులు మొదలుకొని ఎంపీపీ, జెడ్పీటీసీ వంటి పదవులు ఉన్నవారు ఓడిపోయిన వాళ్లు, పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారు, నామినేట్ పదవులు పొందిన వారందరూ కార్లను మేయింటెన్ చేస్తున్నారు. కారుకు ముందు వెనుకాల పదవి హోదా పేర్లతో రేడియం స్టిక్కర్లు అంటించుకొని స్టీరింగ్ ముందు తమ పార్టీ కండువాను పరచుకొని దర్పం ప్రదర్శిస్తుంటారు. ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను చేసైనా అప్పులు తీర్చుకుందామని భావించి.. మరీ అప్పులు చేసి పనులు చేశారు. బిల్లులు ఆలస్యం కావడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడానికి సరిపోలేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గురునాథ్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

బాధ్యతలు స్వీకరించిన గురునాథ్‌రెడ్డి

- కొడంగల్‌లో కాంగ్రెస్ నేతల సంబరాలు

కొడంగల్: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే ఆర్ గురునాథ్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నగరంలోని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు తీసుకున్నారు. కుటుంబ సభ్యులు, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, రావులపల్లి మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు హౌసింగ్ కార్యాలయానికి వెళ్లి గురునాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పోలీసు ఉన్నతాధికారులు సన్మానించారు. గురునాథ్‌రెడ్డికి గతంలో గిడ్డంగుల హౌసింగ్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. ఐదు పర్యాయాలు కొడంగల్ ఎమ్మెల్యేగా కొనసాగారు. కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. మిఠాయిలు తినిపించుకున్నారు.

సమయపాలన పాటించాలి

- రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు

తలకొండపల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చక్కగా పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని వెల్జాల్ బాలికల, బాలుర ప్రాథమిక, ఉన్నత పాఠశాలతో పాటుగా చంద్రధనలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే కంపౌండ్ వాల్‌లో ఉన్నప్పుడు బాల, బాలికలకు ఉమ్మడి టైం టేబుల్ తయారు చేసుకుంటే ఉపాధ్యాయుల కొరత నివారించగలమన్నారు. క్రమం తప్పకుండా డిజిటల్ క్లాస్‌లు బోధించాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలలో మౌలిక వసతులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటల్లో తాజా కూరగాయాలను వాడాలన్నారు. శుచి, రుచి ఉండేలా చూడాలన్నారు. మెనూ పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల స్టాక్, నిల్వ తదితర రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు చదివించి నైపుణ్యాన్ని అంచనా వేశారు. వెల్జాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఇంగ్లిష్ అక్షరమాల చదివించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సర్దార్‌నాయక్, ఆమనగల్లు, కడ్తాల్ నోడల్ అధికారులు పాండు, జంగయ్య, హెచ్‌ఎం నసీమ్ సుల్తానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

బోనమెత్తిన నాగసమందర్

ధారూరు మండలం నాగసమందర్ గ్రామంలో బుధవారం పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

– ధారూరు

అప్రమత్తంగా ఉండండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్
- సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్

అనంతగిరి: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ ఆదేశించారు. బుధవారం వికారాబాద్‌లోని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, పీహెచ్‌సీల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మలేరియా, డెంగీ, ఇతర అంటు వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి.. వారికి రక్త పరీక్షలు చేయాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో రాపిడ్ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేయాలని తెలిపారు. యాంటీ స్నేక్ వీనం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న లెప్రసీ కేసులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(గురువారం) అన్ని పీహెచ్‌సీలలో ర్యాలీలు నిర్వహించి.. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. హై బీపీ, షుగర్, మానసిక సమస్యలు ఉన్న వారిని గుర్తించి వారికి ఇంటి వద్దే మందులు అందేలా చూడాలన్నారు. ప్రతి గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ మాత్రలు వేయాలని ఆదేశించారు. జూలై 25 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు పాఠశాలల్లో, బడి బయట పిల్లలకు మెదడు వాపు వ్యాధి నియంత్రణకు ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు పరిశుభ్రత, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జీవరాజ్, డాక్టర్ సాయిబాబా పాల్గొన్నారు.

వైద్య సేవలు బాగున్నాయా..?

- తాండూరు జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఖాళీ పోస్టుల భర్తీకి కృషి చేస్తానని వెల్లడి

తాండూరు: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ అయ్యేలా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నతో కలిసి బుధవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ సేవలు, భోజన పంపిణీ వివరాలను ఆరా తీశారు. అవసరమైన పోస్టుల కోసం సూపరింటెండెంట్ కేవీఎస్ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డిని ఆదేశించారు. రోగుల బెడ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అత్యవసర వైద్యం కోసం అవసరమైన యంత్రాలను అందుబాటులోకి తెచ్చేలా చూస్తానని స్పష్టంచేశారు. ఆస్పత్రికి అవసరమైన అంబులెన్స్‌ను డొనేట్ చేసేందుకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్ ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే వెంట నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మురళీకృష్ణగౌడ్, హబీబ్‌లాల, వైద్యులు రమణబాబు, సంతోష్ తదితరులు ఉన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

‘డబుల్’ కథ కంచికేనా?

11నెలల క్రితమే దరఖాస్తుల పరిశీలన పూర్తి

- జిల్లాలో సిద్ధంగా ఉన్న ఇళ్లు 1,031
- వచ్చిన దరఖాస్తులు 12,205
- సగానికిపైగా అర్హులే
- పూర్తయిన ఇళ్లను కేటాయించాలంటున్న లబ్ధిదారులు



తాండూరులో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

వికారాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నిర్మాణం పూర్తయిన వాటిని అర్హులకు కేటాయించడంలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటోంది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే జిల్లాలో పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఎప్పుడు కేటాయిస్తారనే విషయంలో స్పష్టత లేకుండా పోయింది. బీఆర్‌ఎస్ హయాంలో స్వీకరించిన దరఖాస్తుల ప్రకారమే ఇళ్లు కేటాయిస్తారా..? లేక కొత్తగా దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారా..? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం వీటి విషయంలో అధికారికంగా ఏ నిర్ణయం తీసుకోనప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఈ ఇళ్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఇంకా ఏ ప్రకటన చేయకపోవడంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కథ కంచికేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. జిల్లాలో 1,031 డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరి కొన్ని చోట్ల తుది మెరుగులు, చిన్న చిన్న పనులు మినహా పనులన్నీ పూర్తయ్యాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చిన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఇప్పటికే పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెండు సార్లు పరిశీలన సైతం పూర్తి చేశారు. లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో గత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది.

దరఖాస్తుల పరిశీలన పూర్తి

వచ్చిన దరఖాస్తులను గతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించేందుకు ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో ముగ్గురు చొప్పున టీమ్‌లను ఏర్పాటు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఎవరు అర్హులు, ఎవరు అనర్హులు అనే వివరాలు సేకరించారు. వచ్చిన అర్జీలకు.. అందుబాటులో ఉన్న ఇళ్లకు తీవ్ర వ్యత్యాసం ఉంది. వచ్చిన దరఖాస్తుల్లో 10శాతం లోపే ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తుల విచారణలో 50శాతం మందే అర్హులు ఉన్నట్టు తేలింది. అర్హుల జాబితాను తగ్గించేందుకు మరోమారు విచారణ కూడా పూర్తి చేశారు. ఈ ప్రక్రియ పూర్తయి ఏడాది కావస్తున్నా ఇళ్ల పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టడం లేదు.

తొలుత 5,740 ఇళ్లు మంజూరు

జిల్లాకు మొదట్లో 5,740 డబుల్ బెడ్‌రూం ఇళ్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. 2016లో భూమి పూజ కూడా చేశారు. ఆ తరువాత ఇళ్ల సంఖ్యను 3,800కి కుదించారు. ప్రస్తుతం 1,031 ఇళ్లు పూర్తి కాగా.. 2,257 నిర్మాణ దశలో ఉన్నాయి. ధారూరులో 120 ఇళ్లు, మర్పల్లిలో 120, యాలాల్ మండలం కోకట్‌లో 180, తాండూరు పట్టణంలో 401, పరిగిలో 180, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30 ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. వీటికీ పదింతలు ఎక్కువ అంటే దాదాపు 12,205 దరఖాస్తులు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న వైస్ చైర్మన్ దీపానర్సిములు

తాండూరు రూరల్: మండలంలోని అంతారం గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి తాండూరు మున్సిపల్ వైస్ చైర్మన్ దీపా నర్సిములు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్‌ను ఆలయ కమిటీ నిర్వాహకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపానర్సిములు రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, శాంతుకుమార్, ప్రభాకర్‌రెడ్డి, సంపత్, రాజేందర్‌రెడ్డి, బాలప్ప, రవి, మల్లప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మూగజీవాలు మృత్యువాత



పల్గురాళ్లతండాలో ఎద్దు కళేబరం వద్ద విచారంలో రైతు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని వేర్వేరు గ్రామాల్లో విద్యుదాఘాతానికి బుధవారం మేక, ఎద్దు మృతి చెందాయి. హుస్సేన్‌పూర్ గ్రామానికి చెందిన కుర్వ బీరప్ప రోజుమాదిరిగా మేకలను మేతకు వదిలారు. గ్రామ శివారులోని వ్యవసాయ పొలం దగ్గర కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్‌కు మేక తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది.

పల్గురాళ్లతండాలో..

మండలంలోని పల్గురాళ్లతండా శివారులో ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేత మేయడానికి వెళ్లిన ఎద్దు విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. బాధితుడు మునగారి సాయిలు తెలిపిన వివరాల మేరకు.. మేత మేస్తున్న క్రమంలో ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌కు గురయిందన్నారు. ఎద్దు విలువ రూ.50వేల ఉంటుందని వాపోయారు. రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో నిత్యం మూగజీవాలు మృతిచెందుతున్నాయని ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

కల్తీ కల్లును అరికట్టండి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్: కల్తీ కల్లును అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు విఫలమయ్యారని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు మాదిగ ఆరోపించారు. మండలంలోని జినుగుర్తి గ్రామంలో రెండు రోజుల క్రితం కల్తీకల్లు తాగి అంజిలప్ప మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింలు మాదిగ మాట్లాడుతూ.. తాండూరు మండలంలో కల్తీకల్లు జోరుగా సాగుతుందన్నారు. కల్తీ కల్లును నియంత్రించడంలో ఎక్సైజ్ శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వెంటనే అధికారులు కల్తీని అరికట్టాలని కోరారు. అదేవిధంగా అంజిలప్ప కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, నర్సిములు, చంద్రప్ప, మోహన్, దశరథ్ తదితరులు ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఏడుగురిని మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. జిల్లెలగూడ అర్పితా ఎన్‌క్లేవ్‌లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులు ఎల్‌బీనగర్ ఎస్ఓటీ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,120 నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

హామీలు ఘనం.. అమలు శూన్యం

- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకుల హామీలు
- తాండూరులో అసంపూర్తిగా పలు అభివృద్ధి పనులు
- లారీ పార్కింగ్ లేక తరచూ ప్రమాదాలు
- నిలిచిపోయిన అవుటర్ రోడ్డు పనులు



తాండూరులో పార్కింగ్ లేక రోడ్డుపై నిలిచిన లారీలు

తాండూరు: ఎన్నికల వేళ కుప్పలు తెప్పలుగా గుమ్మరించిన హామీలు ఎప్పుడు అమలుకు నోచుకుంటాయని సర్వత్రా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కంది బోర్డు ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలతోపాటు పలు రకాల సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో ప్రతి ఐదేళ్లకోసారి వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ పార్టీలకు ప్రధానాస్త్రాలుగా మిగిలిపోతున్నాయే తప్పా పరిష్కారం మాత్రం కావడం లేదు.

నత్తనడకన రోడ్డు విస్తరణ

నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నాటి రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి 2017–2018 మధ్యకాలంలో గొట్లపల్లి శివారులో రవాణా కార్యాలయంతో పాటు డ్రైవింగ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణానికి అవుటర్ రోడ్డుకు రూ.70 కోట్లు మంజూరు చేయించారు. ఆ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అంతారం లారీ పార్కింగ్ అభివృద్ధికి రూ.1.82 కోట్లు మంజూరు కావడంతో శంకుస్థాపన చేశారు. తర్వాత జరిగిన ఎన్నికలలో మహేందర్‌రెడ్డి ఓటమితో పనులు అటకెక్కాయి. 2018లో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆయన సైతం ఒకేసారి రూ.135 కోట్లను మంజూరు చేయించారు. వాటిలో కొన్ని పనులు కార్యరూపం దాల్చాయి. మరికొన్ని ముందుకు సాగలేదు. దశాబ్దకాలంగా తాండూరు–వికారాబాద్ రోడ్డు విస్తరణ నత్తనడకన సాగుతోంది. లారీ పార్కింగ్ యార్డు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

కాగితాలకే కందిబోర్డు

తాండూరు ప్రాంతంలో అధికంగా కంది పంట సాగు అవుతోంది. అందుకోసం ఎన్నికల సమయంలో కందిబోర్డు ఏర్పాటు చేస్తామంటూ రాజకీయ పార్టీ నేతలు దశాబ్దాలుగా హామీలు గుప్పిస్తున్నారు. కానీ గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఎవరు కందిబోర్డు ఏర్పాటు కోసం పూర్తిస్థాయిలో ప్రయత్నించలేదు. స్థానికంగా కంది బోర్డు ఏర్పాటు అయితే శాస్త్రవేత్తలు అందుబాటులో ఉండటం, రైతులకు సబ్సిడీపై విత్తనాలు, కొత్త రకమైన వంగడాల తయారీ ఉంటుంది. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు చేతులెత్తేశారు.

మధ్యలోనే వదిలేశారు

బషీరాబాద్ మండలంలో కాగ్నానది పరివాహక ప్రాంతంలో మూడు ఎత్తిపోతల పథకాలను నాలుగు దశాబ్దాల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే నిర్వహణ సరిగా లేకపోవడంతో మండలంలో ఉన్న జీవన్గి, నవాంద్గి, ఇందర్‌చెడ్ ఎత్తిపోతల పథకాలు రెండు దశాబ్దాలుగా రైతులకు సాగు నీరు అందించడం లేదు. దీంతో ఐదేళ్ల క్రితం నాటి ప్రభుత్వం నవాంద్గి ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ.1.29కోట్లు, ఇందర్‌చెడ్ ఎత్తిపోతల పథకం అభివృద్ధికి రూ.40లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో పనులకు శంకుస్థాపన చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌లు పనులు మధ్యలోనే వదిలేశారు.

చర్చనీయాంశం

నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఎన్నికల హామీలకే పరిమితమైన అభివృద్ధి పనులు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందుకు సాగుతాయా అనేది తాండూరులో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు తనను గెలిపిస్తే 7వ గ్యారంటీగా తాండూరును అభివృద్ధి చేస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



శిథిలావస్థకు నవాంద్గీ ఎత్తిపోతల పథకం



అసంపూర్తిగా నిలిచిన అవుటర్ రోడ్డు

8 వేల లీటర్ల మద్యం బాటిళ్లు ధ్వంసం

జేసీబీతో తొక్కించిన పోలీసులు



మొయినాబాద్ ఠాణా ఆవరణలో ధ్వంసం చేసిన మద్యం సీసాలు

మొయినాబాద్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బెల్టుషాపులు, ఫాంహౌస్‌లలో పట్టుకున్న మద్యం బాటిళ్లను పోలీసులు ధ్వంసం చేశారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని 9 పోలీస్ స్టేషన్లలో నమోదైన 333 కేసుల్లో పట్టుకున్న మద్యం బాటిళ్లను బుధవారం ల్యాండ్ ఆర్డర్ ఎక్సైజ్ పోలీసులు మొయినాబాద్ పీఎస్ ఆవరణలో 8,551 లీటర్ల మద్యం, బీరు బాటిళ్లను జేసీబీతో ధ్వంసం చేశారు. మొయినాబాద్ పీఎస్ పరిధిలో 3,028 లీటర్లు, నార్సింగి పరిధిలో 570 లీటర్లు, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో 765.38 లీటర్లు, శంకర్‌పల్లి 1,200.34 లీటర్లు, మోకిల 888.34 లీటర్లు, చేవెళ్ల 1,140 లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. వీటిని మొయినాబాద్ పీఎస్ ఆవరణకు తరలించి రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఆబ్కారీ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ప్రదీప్‌ల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇరువురికి పదేళ్ల జైలు

అనంతగిరి: దాయాదిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇరువురికి పదేళ్ల జైలు శిక్షను విధిస్తూ ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు ఇచ్చారని ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2013 మే 29న యాలాల మండలం గిరిజాపూర్ గ్రామంలో తెల్లవారు జామున పొలంలో బోర్ వేసే క్రమంలో మైలారం పెద్ద అంత్రాప్ప, మైలారం పెద్ద వెంకటప్పకు సమీప దాయాది మైలారం వెంకటప్పకు ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువురు మైలారం వెంకటప్పను కట్టెలతో కొట్టగా రక్తగాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు మైలారం విజయ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేశారు. ఈ విషయంలో వాదనలు విన్న కోర్టు ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసులో శిక్ష పడే విధంగా పనిచేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గునుగల్‌లో సర్వీస్ వైర్ల చోరీ

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో వ్యవసాయ బోరు మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 15 మంది రైతులకు చెందిన వ్యవసాయ బావుల వద్ద మంగళవారం రాత్రి రూ.2 లక్షలకు పైగా విలువ జేసే సర్వీస్ వైర్లను కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగానే బుధవారం రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చూడగా బోరు మోటార్ల వద్ద ఉన్న సర్వీస్ వైర్లు కత్తిరించి ఉన్నాయి. బాధిత రైతులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల కిందనే గడ్డమల్లయ్యగూడలో 20 మంది రైతులకు చెందిన బావుల వద్ద ఉన్న సర్వీస్ వైర్లను చోరీ చేశారు.

నిధుల మంజూరు హర్షణీయం



చేవెళ్లలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: ముడిమ్యాల–మల్కాపూర్ ఫారెస్ట్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయటం సంతోషకరమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడిగా ఫారెస్ట్ డిపార్టుమెంట్‌కు మండలంలో ఉన్న ముడిమ్యాల అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరానన్నారు. వెంటనే స్పందించి అటవీ ప్రాంతంలో చెట్లు పెంచి చుట్టూ కంచె ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారన్నారు. దీనికి ఫారెస్ట్ డిపార్టుమెంట్ రూ.13 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. నేషనల్ హైవే అథారిటీ నుంచి కూడా ఫారెస్ట్ అభివృద్ధికి రూ.13కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

నెలాఖరులోగా విస్తరణ పనులు

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ రోడ్డుకు ఇప్పటివరకు ఉన్న అడ్డంకులు తొలగి పోయాయన్నారు. కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో గత ప్రభుత్వంలో పనులు ఆలస్యమయ్యాయన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఈ పనులను వేగంగా పూర్తిచేయించాలని చూడటం సంతోషకరమన్నారు. సమావేశంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాములు, గోపాల్ రెడ్డి, మధుసుదన్‌గుప్తా, రాములు, భీమయ్య, శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, జనార్దన్, నరేందర్, పాండు, బాలయ్య, మానిక్యం తదితరులు ఉన్నారు.

హస్తినలో తెలంగాణ డోలుదెబ్బ

బొంరాస్‌పేట: దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజులుగా జరుగుతున్న తెలంగాణ బోనాల ఉత్సవాల్లో రాష్ట్రం తరఫున జిల్లాకు చెందిన మల్లికార్జున బృందం ప్రదర్శనలతో ఆకట్టుకుంటుంది. బుధవారం తెలంగాణ భవన్ వద్ద ఒగ్గుడోలు బృందం విన్యాసాలు ప్రదర్శించింది. మండల పరిధిలోని నాందార్‌పూర్‌కు చెందిన ఒగ్గు బీరు కళాబృందం 20 మంది సభ్యులతో డోలు ప్రదర్శించి రాష్ట్ర కళాఖ్యాతిని చాటారు.



ఢిల్లీలో ఒగ్గుడోలు ప్రదర్శన చేస్తున్న కళాకారులు

క్వారీలో పడి కార్మికుడి దుర్మరణం

కొందుర్గు: క్వారీలో డ్రిల్లింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి గోతిలో పడి కార్మికుడు దుర్మరణం పాలైన సంఘటన కొందుర్గు మినరల్స్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా శౌలి గౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన రూపని రమ, రవి(40) దంపతులు కంప్రెషర్ డ్రిల్లింగ్ పనులు చేస్తుంటారు. మంగళవారం కొందుర్గు మినరల్స్‌లో 70 ఫీట్ల లోతైన గుంతలో డ్రిల్లింగ్ చేస్తూ రవి జారి పడి మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీ

రూ.13 వేల సామగ్రిని ఎత్తుకెళ్లిన దుండగులు



అంగన్‌వాడీ కేంద్రం తాళం పగలగొట్టిన దొంగలు

పరిగి: తాళాలు పగలగొట్టి రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో చోరీకి పాల్పడిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాపోల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–1, అంగన్‌వాడీ కేంద్రం–2లో ఒకే రోజు దొంగతనం జరిగింది. రోజు మాదిరిగానే మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది విధులు ముగించుకొని కేంద్రాలకు తాళాలు వేసుకుని వెళ్లారు. బుధవారం ఉదయం కేంద్రాలు తెరిచేందుకు వచ్చిన అంగన్‌వాడీ కేంద్రం–1 కార్యకర్త బాలమణి తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే లోపలికి వెళ్లి పరిశీలించగా సామగ్రి మొత్తం చిందరవందంగా పడి ఉన్నాయి. వెంటనే పక్కనే ఉన్న మరో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించగా తాళం విరగగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే కార్యకర్తకు సమాచారం అందించారు. వచ్చి పరిశీలించగా అంగన్‌వాడీ కేంద్రం–1లో 22 కిలోల కందిపప్పు, 15 కిలోల నూనె, 60 గుడ్లు, సిలిండర్ ఎత్తుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రం–2లో 75 కిలోల బియ్యం, 600గుడ్లు, 22 లీటర్ల పాల ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. రెండు కేంద్రాల్లో చోరీకి గురైన సామగ్రి విలువ సుమారుగా రూ.13,284 వరకు ఉంటుంది. అంగన్‌వాడీ కార్యకర్త బాలమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా మత్స్య రైతుల దినోత్సవం



వేదికపై మత్స్యకార రైతులు, అధికారులు

మోమిన్‌పేట: ప్రభుత్వం మత్స్యకారులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య అన్నారు. బుధవారం మోమిన్‌పేట మండలంలోని నందివాగు ప్రాజెక్టు చేపల కేంద్రంలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సహకార సంఘాలు అభివృద్ధి చెందాలన్నారు. అందుకు సంఘాలన్నీ బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, డైరెక్టర్‌లు రాజు, పెంటయ్య, అంబదాసు, అంజన్న, రాజు, మునీందర్, మహేష్, ప్రశాంత్, రంజిత్, హన్మంత్, నర్సింలు, అలీ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్‌రావు

షాద్‌నగర్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సంఘం నాయకులు అడ్డా వద్ద కూలీలతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రావు మాట్లాడుతూ.. పొట్టకూటి కోసం రెక్కలు ముక్కలు చేసుకొని ఎంతో కార్మికులు కష్టించి పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పని ప్రదేశంలో ప్రమాద మరణానికి రూ.ఆరు లక్షల నుంచి రూ.పది లక్షల చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా మంది కార్మికులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రావాల్సి ఉందని వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాజునాయక్, శ్యాం, మల్లేష్, శ్రీరాములు, రమేష్, గోపాల్, యాదయ్య, చెన్నయ్య, శ్రీశైలం, విజయ్‌కుమార్, వెంకటేష్, రాములు, పాండు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని రైతు ఆత్మహత్య



బాలరాజు మృతదేహం

కేశంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యార బాలరాజు(58) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం గ్రామ శివారులో తన పొలంలో బాలరాజు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇదే విషయమై మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రైతు భరోసాతో మేలు



రైతులతో భారతీయ కిసాన్‌సంఘ్ నాయకులు

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

కడ్తాల్: రైతుభరోసా పథకం రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చల్లంపల్లి గ్రామంలో భారతీయ కిసాన్‌సంఘ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ పంటలకు సకాలంలో పెట్టుబడులు అందక రైతాంగం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆపత్కాల పరిస్థితుల్లో ప్రభుత్వం రైతుభరోసా తేవడం సంతోషించాల్సిన విషయమన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రైతు ఆదాయాన్ని పెంచుకుని, జీడీపీ పెంచడంలో రైతులది ప్రధాన పాత్ర అన్నారు. తక్కువ, మధ్యస్థ, ఎక్కువ భూమి కలిగిన రైతులందరికీ పెట్టుబడి సాయం అవసరమని గుర్తు చేశారు. ప్రతి ఎకరాకు రైతుభరోసా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం భారతీయ కిసాన్‌సంఘ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన చల్లా అశోక్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగల శ్రీధర్‌రెడ్డి, చల్లా పవన్‌రెడ్డి, అంజయ్య, రామకృష్ణ, మల్లేశ్, మహేశ్, రామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి, జంగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- రాత్రివేళల్లో జోరుగా సాగుతున్న దందా
- చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్న అటవీ అధికారులు




దుద్యాల్‌గేట్ సమీపంలో లోడ్ అవుతున్న కలప లారీ (ఫైల్)

దుద్యాల్: మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి.. అని ప్రభుత్వాలు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు పదే పదే చెబుతున్న మాటలు నీటి మీద రాతలవుతున్నాయి. అక్రమార్కుల తాకిడికి అడవి ఎండుటాకుల మారుతోంది. ఇష్టం వచ్చినట్లు చెట్లను నరికి యథేచ్ఛగా కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో వందల ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. హస్నాబాద్ గ్రామానికి చెందిన అటవీ ప్రాంతంలో మానవాళి మనుగడకు దోహదపడే చెట్లను అమాంతం నరికివేస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో మిషన్ కోతలతో భారీ వృక్షాలను సైతం సులువుగా నెలకొరిగిస్తున్నారు. అనంతరం వాటిని చిన్న చిన్న మొద్దులుగా మారుస్తూ వాటిని రాత్రివేళల్లో తరలిస్తూ అక్రమార్జన గడిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రానికి సమీపంలో మహారాష్ట్రకు చెందిన వ్యాపారి తెలంగాణ నుంచి కలపను అక్రమంగా తరలించిన ఉదంతం వెలుగు చూసింది. చాలా మంది వ్యాపారులు కలపను షమియాలకు, కట్టెల డిపోలకు తరలిస్తున్నారు.

అమలు కాని నిబంధనలు

నిబంధనల ప్రకారం రైతులు తమ పొలాల్లో ఉన్న చెట్లను నరికివేయాలనుకుంటే అటవీశాఖ అధికారులకు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేయాలి. ఈ తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఇలాంటి నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదు. అక్రమార్కులు రాత్రివేళ కలప రవాణా చేసుకుంటూ కాసులు దండుకుంటున్నారు. పర్యావరణాన్ని చేతులారా నాశనం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం వర్షాకాలంలో మొక్కలు నాటిస్తుండగా క్షేత్రస్థాయిలో కొందరు దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది కొడంగల్ పరిధిలో 30కి పైగా కలప అక్రమ రవాణాకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. దీంతో ప్రకృతి ప్రేమికులు, స్థానికులు ఈ దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు చేపడుతాం



పొరపాట్లకు తావివ్వకుండా పటిష్ట చర్యలు చేపట్టాం. అయినా కొందరు రాత్రి వేళల్లో కలప తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీని కట్టడికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. చెట్ల వినాశనాన్ని కోరుకుంటే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదు. చట్ట పరమైన చర్యలు చేపడుతాం. అనుమతి లేకుండా కలప రవాణా చేస్తే వాహనాన్ని సీజ్ చేస్తాం.

– మహ్మద్ అబ్దుల్ హై, అటవీశాఖ రెంజ్ అధికారి, పరిగి